క్లుప్తంగా

నాణ్యమైన సేవలు అందిస్తాం



మాట్లాడుతున్న మీసేవ నిర్వాహకులు

శ్రీకాళహస్తి: మీసేవ కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని మీసేవ కార్యవర్గ సభ్యులు అన్నారు. పట్టణంలోని పొన్నాలమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఆపరేటర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో మీసేవ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల మీసేవ ప్రతినిధులు పాల్గొన్నారు. మీసేవ నిర్వాహకులు సూర్యకుమార్, కిరణ్‌కుమార్, శ్రావణ్ పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

రేణిగుంట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 12వ తేదీ తిరుపతిలో నిర్వహిస్తున్న సారథ్యం యాత్ర సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలో నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జీపాళ్యం తేజోవతి, మండల అధ్యక్షుడు పూజారి ప్రేమ్‌కుమార్ రెడ్డి, జీపాళ్యం కృష్ణారెడ్డి, కండ్రిగ యతేంద్రరెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

మానవసేవే మాధవ సేవ



సరుకులు పంపిణీ చేస్తున్న సీఐ

శ్రీకాళహస్తి: మానవసేవే మాధవసేవ అని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని నగరి వీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులు, వృద్ధులకు నెలసరి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సీఐ నాగార్జునరెడ్డి హాజరై నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు గరికపాటి రమేష్ బాబు, గుమ్మళ్ల రాజేశ్వరరావు, హరినాయుడు, బాబా ఫరీద్, సతీష్ పాల్గొన్నారు.

చికెన్ సెంటర్‌పై కేసు నమోదు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ప్రశాంత్ చికెన్ సెంటర్‌లో తూకంలో మోసం చేయడాన్ని తూనికల కొలతలు ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్ ఆదివారం జరిపిన ఆకస్మిక తనిఖీలో గుర్తించారు. పూర్తిగా తూకాల్లో తేడా ఉన్నట్లు ఆయన గుర్తించారు. దుకాణం యాజమానిపై కేసు నమోదు చేశారు. తూకంలో మోసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కనులపండువగా కొల్లాపురి జాతర



విశేష అలంకరణలో అమ్మవారు

రేణిగుంట: పట్టణంలోని కొల్లాపురి అమ్మవారి జాతరలో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి శోభాయమానంగా అలంకరించారు. గ్రామంలో అమ్మవారి గెరిగను ఊరేగించారు. అనంతరం మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి కుంభం వేసి పూజలు నిర్వహించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని చెన్నై వాసులు, పారిశ్రామికవేత్త కియా షోరూం, టయోటా, హోండా షోరూం అధినేత కుటుంబసభ్యులు కారు పర్తి మధుసూదన్‌రావు, కారుపర్తి నాగ వెంకట ఉళ్లక్కిబాబు, ధర్మపత్ని కోట నాగజ్యోతి, బాబుగణేష్ గంగసాయి చాద్విక్ దర్శించుకున్నారు. వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ్ సంక్షేమ సంఘం యువత అధ్యక్షుడు పులి రామచంద్ర, స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు.

సీసీ కెమెరాల వితరణ



సీసీ కెమెరాలను అందజేస్తున్న హేమకుమార్

శ్రీకాళహస్తి: ఎంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీసెస్ శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో తెలుగు కాలనీలో ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ గర్ల్స్ పాఠశాల, కళాశాలకు ఐదు సీసీ కెమెరాలను వితరణగా ఇచ్చారు. సంస్థ అధ్యక్షుడు హేమ్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీమతి లలిత, వైస్ ప్రిన్సిపల్, సభ్యులు ప్రదీప్‌కుమార్, పార్థసారథి, శ్రీనివాసులు పాల్గొన్నారు

ఇంకెంతకాలం ఇన్‌చార్జ్‌లు?

- ఏఈలు లేని సత్యవేడు ఇరిగేషన్ శాఖ
- నామమాత్రంగా సాగునీటి వనరుల పర్యవేక్షణ
- ఇన్‌చార్జ్ అధికారులతో కాలక్షేపం



సత్యవేడు ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయం



గత ఏడాది వర్షాలకు కోతకు గురైన సంతవేలూరు చెరువుకట్ట

వరదయ్యపాళెం: సత్యవేడు ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్‌కు అధికారులు కరువయ్యారు. గత కొంతకాలంగా ఇన్‌చార్జ్ ఏఈలతో నెట్టుకొస్తున్నారు. ఎంతో కీలకమైన సాగునీటి వనరుల పర్యవేక్షణకు కీలకంగా వ్యవహరించాల్సిన ఇంజినీరింగ్ అధికారులే కరువయ్యారు. ఈ సబ్ డివిజన్ పరిధిలో వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, సత్యవేడు, కేవీబీపురం మండలాలు ఉన్నాయి. 7 సెక్షన్లు కలిగిన సత్యవేడు ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్‌లో ఒకే ఒక్క రెగ్యులర్ ఏఈ ఉండడం గమనార్హం. మిగిలిన 6 సెక్షన్లకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు. దీంతో ఇన్‌చార్జ్ అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా మారింది. అసలు సత్యవేడు సబ్ డివిజన్‌లో ఇరిగేషన్ శాఖ పనిచేస్తోందా లేదా అనే అనుమానాలు సైతం రైతులు వ్యక్తం చేస్తున్నారు. రైతుల పంటల సాగుకు ఇరిగేషన్‌కు చెందిన సాగునీటి చెరువులు ప్రధాన ఆధారం. అలాంటి చెరువుల పర్యవేక్షణకు కీలకంగా వ్యవహరించాల్సిన ఏఈలు లేకపోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారుల భర్తీకి ఏమాత్రం ఆలోచన చేయకపోవడం గమనార్హం.

ఆ రెగ్యులర్ ఏఈనే దిక్కు

సత్యవేడు ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో 7 సెక్షన్లకు సంబంధించి కేవీబీపురం మండలంలో ఓ సెక్షన్‌కు ఏఈగా విధులు నిర్వహిస్తున్న బాబునే దిక్కయ్యారు. 7 సెక్షన్ల పరిధిలో 416 సాగునీటి చెరువులు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ పూర్తి బాధ్యత ఏఈలదే. అలాంటి ఏఈ పోస్టులు 6 సెక్షన్లకు ఖాళీ ఉన్నాయి. దీంతో సత్యవేడు సెక్షన్‌కు సంబంధించి వడమాలపేట మండలానికి చెందిన ఏఈ ఇన్‌చార్జ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వరదయ్యపాళెం మండలానికి సంబంధించి 2 సెక్షన్లు ఉండగా బీఎన్ కండ్రిగకు చెందిన ఏఈ బాబు, తొట్టంబేడు మండలంలో బాధ్యతలు నిర్వహిస్తున్న నాగ రాజులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే బీఎన్ కండ్రిగ మండలానికి సంబంధించి తిరుపతి వాటర్ సప్లైయర్స్ విభాగానికి చెందిన ఏఈ సురేష్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో వారు మండలానికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి. ఆ శాఖలో జరగాల్సిన అభివృద్ధి పనులు సైతం నామమాత్రంగా మారాయి. దీంతో రైతుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత ఏడాది వర్షాలకు దెబ్బతిన్న చెరువుల అభివృద్ధి జరిగేనా?

గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సత్యవేడు సబ్ డివిజన్‌లోని పలు సాగునీటి చెరువులు, కాలువలు దెబ్బతిన్నాయి. అయితే వాటిని అభివృద్ధి చేసేందుకు నిధుల మంజూరు కోసం పనులకు సంబంధించి ఎస్టిమేట్‌ను సైతం సిద్ధం చేయలేని పరిస్థితి. దీంతో ప్రధానంగా వరదయ్యపాళెం మండలంలోని పులిబొంద, మార్లమడుగు, కరిపేటి కాలువ, సంతవేలూరు చెరువులు ఉన్నాయి. అంతేకాక కేవీబీపురం మండలంలోని ఆరె చెరువు కూడా దెబ్బతింది. అలాగే బీఎన్‌కండ్రిగ, సత్యవేడు మండలాల్లో దెబ్బతిన్న చెరువులు అనేకమున్నాయి. ఈ చెరువుల అభివృద్ధి గురించి ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళిక లేకపోవడం అధికారుల కొరతకు నిదర్శనం.

ఇన్‌చార్జ్‌లతో ఇంకెన్నాళ్లు?

సత్యవేడులో పేరుకు ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్ ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో ఉన్న సందర్భం లేదు. దీంతో ఆ శాఖ సేవలు నామమాత్రంగా మారాయి. మూడేళ్లకు పైగా పూర్తిస్థాయి ఏఈ అధికారులు సబ్ డివిజన్‌లో లేరు. అంతేకాక సబ్ డివిజన్‌కు ఉన్న డీఈఈకి సైతం శ్రీకాళహస్తి ఈఈ బాధ్యతలను అప్పగించడంతో ఆయన కూడా కార్యాలయానికి రావడం నామమాత్రమే అవుతోంది. ఆయన శ్రీకాళహస్తి ఇరిగేషన్ డివిజన్ కార్యాలయానికి ఈఈగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో డివిజన్ స్థాయిలో బాధ్యతలను చక్కదిద్దేందుకు ఆయనకు సమయం చాలడం లేదు. దీంతో సబ్ డివిజన్ వైపు తిరిగి చూసే దిక్కే లేదు. ఆ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్, ముగ్గురు అటెండర్లు మాత్రమే దర్శనమిస్తారు.

ఖాళీలు భర్తీ చేయాలి..



విభాగం అధ్యక్షుడు సాగునీటి వనరుల పర్యవేక్షణలో కీలకమైన మైనర్ ఇరిగేషన్ శాఖకు అధికారులను నియమించకుండా కాలయాపన చేయడం దారుణం. నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులోని ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 6 సెక్షన్లకు ఏఈలను భర్తీ చేయాలి. నిర్లక్ష్యం చేయడం తగదు.

–మల్లికార్జున్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ రైతు

ఇన్‌చార్జ్‌లతో పనులు జరగవు



గ్రామస్థాయిలో చెరువులకు మరమ్మతులు, పూడికతీత వంటి పనులు నిర్వహణ సాగునీటి సంఘాలకు నిధులు కేటాయించే అవకాశమున్నా అధికారులు అంచనా వేసే పరిస్థితి లేకపోవడం బాధాకరం. అత్యవసర పనులు సైతం సకాలంలో నిర్వహించలేకపోతున్నారు. ఈ వెంటనే ఖాళీలను భర్తీ చేయాలి.

–దాసరి జనార్ధన్, వ్యవసాయ కార్మిక సంఘం, సత్యవేడు నియోజకవర్గ నేత

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

నారాయణవనం: మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. స్థానిక ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో ఉదయం మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలను వెలిగించి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. కంకణధారణ భక్తులు గ్రామంలోని ఆలయాలను దర్శించుకుని సొరకాయలస్వామి ఆలయ సమీపంలోని అరుణానదికి చేరుకున్నారు. పసుపు దుస్తులు ధరించి, పూలతో సుందరంగా అలంకరించుకున్న భక్తులు, ద్రౌపదీదేవి, పూలతో అలంకరించిన కలశంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అప్పటికే సిద్ధం చేసిన అగ్నిగుండంలో భక్తులు గోవింద నామస్మరణ మధ్య ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. జోరున పడుతున్న వర్షంలోనూ వందల సంఖ్యలో మహిళలు అగ్నిగుండ ప్రవేశ ఉత్సవాన్ని తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

కమనీయం.. నీలకంఠేశ్వరుని కల్యాణం



సారె తీసుకొస్తున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులోని శ్రీఅన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ నుంచి స్వామి అమ్మవార్లకు ఈఓ బాపిరెడ్డి సారెగా పట్టువస్త్రాలను సమర్పించారు.

ఎన్నికల ముందు బాబు మాయమాటలు



గాజులపెళ్లూరులో క్యూఆర్ కోడ్ బ్రోచర్లపై వివరిస్తున్న నూకతోటి రాజేష్



నెలవాయిలో క్యూఆర్ కోడ్ బ్రోచర్ల పంపిణీ

- ఏడాదైనా అమలు కాని హామీలు
- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు మాయమాటలు చెప్పి, అనేక హామీలు గుప్పించి, కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాదైనా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజక సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గాజులపెళ్లూరు, కాంపాళెం, కంచనపుత్తూరు, నెలవాయి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాబు మోసాల మేనిఫెస్టోను ఈసందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో తల్లికి వందనం పథకం ద్వారా బడికెళ్లే ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేస్తున్నారని, అర్హులైన చాలా మందికి ఈ పథకం వర్తించ లేదని ఆయన మండిపడ్డారు. అలాగే దీపం అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇలా ప్రతి పథకాన్ని చంద్రబాబు అటకెక్కించారని విమర్శించారు. ఓట్ల కోసం సూపర్ సిక్స్‌తో మోసం చేసిన చంద్రబాబును అవకాశం వచ్చినప్పుడు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన ఈసందర్భంగా కోరారు. దీనిపై స్పందించిన కాలనీవాసులు చంద్రబాబును నమ్మి ఓట్లేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందుకే ఈ విషయాలన్నీ ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ఇంటింటికి వెళ్లి అందజేసిన బ్రోచర్‌లో క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేసి చంద్రబాబు మోసాలను గ్రామస్తులకు చూపించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మణినాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనరు వేలూరు రాకేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, అజయ్‌రెడ్డి, గురవయ్య, దేవదాసురెడ్డి, జయచంద్రనాయుడు, కిరణ్‌యాదవ్, రమేష్, కేశవులు, శివయ్య, సర్పంచ్ స్వప్న, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం పూజలు



మిథున్‌రెడ్డి విడుదల కోసం పూజలు చేస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని ఆదివారం కంచనపుత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పూజలు చేశారు. మిథున్‌రెడ్డి పేరుతో అర్చన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి ఎరుగని, అవినీతి మచ్చలేని నాయకుడు, పార్లమెంట్ మాజీ ప్యానల్ స్పీకర్ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని తెలిపారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్‌సీపీని అణచివేయలేరన్నారు. రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక తప్పుడు కేసులతో వారిని నిలువరించాలని చూస్తున్నారని తెలిపారు. రాజకీయాల కోసం మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం సబబు కాదని, త్వరలోనే ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు, ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, నాయకులు జొన్నల గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, సర్పంచ్ స్వప్న, నాయకులు గురవయ్య, చంద్రశేఖర్, కిరణ్‌యాదవ్, సుబ్రమణ్యం, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు అంకురార్పణ





అలంకరణలో నడివీధి గంగమ్మ, పాల కలశాలను తీసుకొస్తున్న భక్తులు

రేణిగుంట: స్థానిక నడి వీధి గంగమ్మ జాతరకు పాలాభిషేకంతో అంకురార్పణ జరిగింది. నడి వీధి గంగమ్మ త్రిశూలం నుంచి ముత్తైదువలు, ఆలయ కమిటీ సభ్యులు 216 కలశాలతో పాలను తీసుకుని ఊరేగింపుగా గంగమ్మ గుడికి చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు పాలాభిషేకం నిర్వహించారు. పాలాభిషేకం మహోత్సవాన్ని ఇటలీకి చెందిన దంపతులు వీక్షించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాలాభిషేకం అనంతరం అమ్మవారి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త సోల మల్లికార్జున్ రెడ్డి, వార్డు సభ్యులు ఎంజీ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ స్థాయిల్లో పూర్వ విద్యార్థులంతా హాజరయ్యారు. అనంతరం తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులందరిని ఘనంగా శాలువాలు కప్పి సన్మానించారు. బహుమతులు ప్రదానం చేశారు. రిటైర్డ్ హెచ్ఎం బ్యూలా, నగరి ఎంఈఓ శ్రీదేవి, ఉపాధ్యాయులు, ధరణి, నీలకంఠం, జయపాల్, రాంబాబు, విజ్ఞాన సుధ స్కూల్ చైర్మన్ హేమకుమార్, పూర్వ విద్యార్థులు ఉదయ్ కుమార్, హరీష్, ప్రభాకర్, అశోక్, సుధా, సతీష్, లోకేష్, బాలాజీ, నగేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీ సభ్యులు

రేణిగుంట: మండలంలోని మామండూరు గ్రామంలోని రాములవారి దేవాలయం ఆవరణలో ఆదివారం అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నూతన తిరుపతి జిల్లా సమన్వయకర్త మునిరాజా ఆధ్వర్యంలో ఇంటింటా భజన, మా ఇంటి భజన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడు మునిశంకర్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ప్రకటించారు. రేణిగుంట గౌరవ సలహాదారుడు వల్లేపల్లి కాళప్ప, గౌరవాధ్యక్షుడు ఆర్.విజయ్‌బాబు, అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు పులుసు హరిప్రసాద్, కార్యదర్శి కుమార్, సహాయ కార్యదర్శి సురేష్, ప్రచార కార్యదర్శి కృష్ణంరాజు, కార్యవర్గ సభ్యులుగా పీడీ నిరంజన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, ఆలుత్తూరు రాజశేఖర్, కల్లూరి ఇలవర్షన్, గొల్ల రాజేష్, కేశవులను నియమించారు. జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు నవీన్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో గంగమ్మ



దర్శించుకుంటున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామంలో గ్రామస్తులు నిర్మించిన శ్రీగంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. యాగశాల పూజలు, నాడి సంధానం, ప్రాణప్రతిష్ఠ, సంపాతాజ్య సంస్పర్శనం, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, మహా కుంభాభిషేకం, అలంకారం, స్వర్ణదర్పణం కార్యక్రమాలు జరిగాయి. శ్రీగంగమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సింగిల్ విండో చైర్మన్ జన్మదిన వేడుకలు

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ సత్యవేడు మండలం మాజీ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ నిరంజన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఆయన జన్మదినం సందర్భంగా ఆదివారం సత్యవేడు పంచాయతీ సర్పంచ్ బెల్ట్ రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం నిరంజన్‌రెడ్డిని పార్టీ శ్రేణులు శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాళమ నాయుడుపేట సర్పంచ్ జయ, నాయకులు సెంథిల్ కుమార్, సోము, యుగంధర్, శ్రీను, చిరంజీవి, నాగరాజు, పళని పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో జోరు వాన

శ్రీకాళహస్తి: పట్టణంలో ఆదివారం రాత్రి జోరు వాన కురిసింది. రాత్రి 7గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం రాత్రి 10గంటల వరకూ పడుతూనే ఉంది. 7 గంటల నుంచి 8గంటల వరకు ఆ సమయంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని నాలుగు మాడవీధులు జలమయం అయ్యాయి. దీంతో భక్తులు, ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా పట్టణంలోని పాతబస్టాండు, జయరామరావువీధి, దక్షిణ కైలాస్‌నగర్, మంగళవీధి, గాంధీ వీధి ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. ఒక ఆటో కాలువలో అదుపు తప్పింది. స్థానికులు గుర్తించి సకాలంలో ఆటోను పక్కకు లాగారు. దీంతో ప్రమాదం తప్పింది. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతోనే ఇలా నీరు రోడ్లపైకి వచ్చిందని స్థానికులు అంటున్నారు.

కోలాహలం.. అగ్నిగుండ ప్రవేశం





అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి ఆలయ 155వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం కోలాహలంగా జరిగింది. ప్రతిఏటా జరిగే ధర్మరాజస్వామి తిరునాళ్ల ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కంకణాలు ధరించి, మడిస్నానాలు చేసి అగ్నిగుండ ప్రవేశం కోసం క్యూలో నిల్చున్నారు. వర్షం రావడంతో గంటకు పైగా భక్తులు నిరీక్షించారు. వర్షం నిలిచాక అగ్నిగుండ ప్రవేశం జరిగింది. డీఎస్పీ శ్రీనివాసులు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.